క్లుప్తంగా

రెడ్డివారిపల్లిలో చోరీ


ఘటనపై ఆరా తీస్తున్న పోలీసులు

ఎన్పీకుంట: ఎన్.రెడ్డివారిపల్లిలోని ఓ ఇంటిలో చోరీ జరిగింది. బాధితురాలి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హసీనా ఇంటికి తాళం వేసి దిగువతూపల్లిలో ఆదివారం జరిగిన పీర్లపండుగకు వెళ్లింది. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపునకు వేసి తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న రూ.5 వేల నగదు ఎత్తుకెళ్లారు. దీంతోపాటు చీరలకు నిప్పుపెట్టారు. ఇంట్లో నుంచి పొగలు రావడంతో చుట్టపక్కల వారు గమనించి హసీనాకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న హసీనా వెంటనే బీజేపీ మైనారిటీ మోర్చా కార్యవర్గ సభ్యుడు బాబ్జాన్ ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనస్థలిని పరిశీలించారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా మండలస్థాయిలో జరిగే ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు.

ఎమ్మార్పీఎస్ లక్ష్యాలను తెలియజేయండి


న్యామద్దెలలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న నాయకులు


చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని న్యామద్దెల గ్రామంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను నాయకులు ఆవిష్కరించారు. చదువుకున్న యువత ఎమ్మార్పీఎస్ లక్ష్యాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణకు చేస్తున్న కృషిని వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెస్సీ జిల్లా అధ్యక్షుడు బండారు కదిరప్ప, అధికార ప్రతినిధి నాగభూషణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదినారాయణతో పాటు అర్జునప్ప, రామాంజనేయులు, శివయ్య, రామాంజనేయులు, నరేంద్ర, మురళీ, రామాంజనేయులు, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటి నీరు పోస్తున్న కమిషనర్

ధర్మవరం అర్బన్: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ తెలిపారు. ధర్మవరం సైక్లింగ్ అండ్ వాకర్స్ క్లబ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో కేతిరెడ్డి కాలనీ ఎల్-1లోని ప్రభుత్వ స్థలంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. పట్టణంలో పచ్చదనం పెంచేందుకు, కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు విరివిగా పెంచాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించి చెట్లుగా మార్చే బాధ్యతను చేపట్టాలని కోరారు. డీసీవీసీ సంస్థ గౌరవాధ్యక్షుడు గోరకాటి పెద్దారెడి పాల్గొన్నారు.

కుమ్మర్లకు న్యాయం చేయండి


మంత్రికి సమస్యను వివరిస్తున్న నాయకులు

బత్తలపల్లి:కుమ్మర శాలివాహనులకు కేటాయించిన భూమిని నిరుపేద కుమ్మర్లకు దక్కేలా చూడాలని ఉమ్మడి జిల్లా శాలివాహన కుమ్మర సంఘం నాయకులు మంత్రి సత్యకుమార్‌ను కలిసి విన్నవించారు. ఆదివారం అనంతపురంలోని బీజేపీ కార్యాలయంలో మంత్రిని కుమ్మర శాలివాహన సంఘం నాయకులు ఓబుళపతి, భానుకోట రామాంజనేయులు, రామాంజినమ్మ, గంగవరం ఆంజనేయులు, ఓబులేసు, రాచానపల్లి రామాంజనేయులు, భానుకోట నరసింహులు తదితరులు కలిసి కుమ్మర శాలివాహనుల సమస్యలను తెలియజేశారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తమకు ధర్మవరం సమీపంలో భూమి కేటాయించారని, విచారించి అర్హులైన కుమ్మర్లకు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

బత్తాయి తోట.. లాభాల మూట

- చీనీ సాగుకు అనుకూలమైన నేలలు
- చీనీపంటకు బీమా అందించిన గత ప్రభుత్వం
- మండలంలో విస్తరిస్తున్న తోటలు

తాడిమర్రి: మండలంలోని పలు గ్రామాల్లో చీనీ(బత్తాయి) పంటలు సాగు చేస్తున్న రైతులు లాభాల బాటలో పయనిస్తున్నారు. నేలలు అనుకూలంగా ఉండటం, గత ప్రభుత్వ ప్రోత్సాహం వెరసి చీనీతోటల సాగు పెరిగింది. కునుకుంట్ల, రామాపురం, శివంపల్లి, తాడిమర్రి, చిల్లకొండయ్యపల్లి, మోదుగులకుంట, మద్దులచెర్వు, ఏకపాదంపల్లి, ఆత్మకూరు, అగ్రహారం, పిన్నదరి, పూలఓబయ్యపల్లి తదితర గ్రామాల్లో రైతులు ఎక్కువగా చీనీ సాగు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చీనీ పంటకు రాయితీలు, బీమా అందించింది. 2019 నుంచి 2023 వరకు వర్షాలు ఆశాజనకంగా కురవడం, ఏపీబీఆర్ నీటితో మండలంలో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో రైతులు అధికంగా చీనీ మొక్కల సాగుకు మొగ్గు చూపారు. ప్రస్తుతం మండలవ్యాప్తంగా 8,500 ఎకరాల్లో చీనీ పంట సాగైంది.

గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ప్రత్యేక చొరవతో చెరువులు, కుంటలకు పీఏబీఆర్ నీటిని విడుదల చేయించారు. ప్రధానంగా ఎం.అగ్రహారం, తాడిమర్రి తూర్పు, పడమర చెరువులు, నిడిగల్లు, నార్సింపల్లి చెరువులు, మేడిమాకులపల్లి, పుల్లానారాయణపల్లి, ఏకపాదంపల్లి గ్రామాల్లోని కుంటలను నింపారు. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. ఫలితంగా మండలంలో చీనీ తోటల సాగుకు అనుకూలత ఏర్పడింది.

ఎర్ర నేలలు చీనీ సాగుకు అనుకూలం

మండలంలోని 30 గ్రామాల్లో ఎర్రనేలలు అధికంగా ఉన్నాయి. దీంతో చీనీ తోటల సాగుకు ఈనేలలు అనువుగా ఉన్నాయని రైతుల అభిప్రాయం. సాగునీటి సౌకర్యం అధికంగా ఉండి మొక్కకు కావలసిన నీటిని పుష్కలంగా అందిస్తే ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. అలాగే ఇతర ప్రాంతాలతో పోల్చితే మండలంలో సాగు చేసిన చీనీ కాయలు తీపి ఎక్కువగా ఉంటుంది. దీంతో వీటికి బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, నాగపూర్ తదితర పట్టణాల్లో ఈ పంటకు డిమాండ్ ఉంది.

వైఎస్సార్ జిల్లా మొక్కలకు అధిక డిమాండ్

మండలంలోని చీనీ తోటలను సాగు చేస్తున్న రైతులు అధికంగా వైఎస్సార్ జిల్లా నుంచి అంటు మొక్కలను తెచ్చుకుంటారు. వైఎస్సార్ జిల్లా ఇగుంకుట్ల, వెలిదండ్ల, బిగునంచెర్ల తదితర గ్రామాల నుంచి తెచ్చిన మోసంబీ రకం మొక్కలను రైతులు అధికంగా సాగు చేస్తూ అధిక దిగుబడి సాధిస్తున్నారు.


తాడిమర్రి సమీపంలో సాగు చేసిన చీనీ తోట

ఐదేళ్ల పాటు కాపాడితే చాలు.

చీనీ మొక్కలు నాటిన అనంతరం ఐదేళ్ల పాటు కంటికి రెప్పలా కాపాడుకుంటే ఆపై లక్షల రూపాయల ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 125 మొక్కల ప్రకారం ఐదెకరాల్లో 625 మొక్కలు నాటొచ్చు. ఐదేళ్ల పాటు సేంద్రియ ఎరువులు, రసాయన ఎరువులు తదితర పెట్టుబడులకు సుమారు రూ.2 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఐదేళ్ల తర్వాత పంట దిగుబడి మొదలవుతుంది. ఏడాదికి రెండు కోతల ప్రకారం సుమారు రూ.20 లక్షల దాకా ఆదాయం పొందొచ్చు. తోటల్లో తొలి మూడేళ్లలో అంతరం పంటలుగా వేరుశనగ, టమాట తదితర పంటలు సాగు చేసి ఆదాయం పొందొచ్చు.

ఉపాధి హామీకి అనుసంధానం చేయాలి



చీనీ తోటల సాగుకు ఉపాధి హామీని అనుసంధానం చేయాలి. చీనీ తోటల సాగులో మొక్కలు, సేంద్రియ, రసాయన ఎరువులు, కూలీల ఖర్చులు అధికం అవుతున్నాయి. అవసరం ఉన్న రైతులకు ఉపాధి హామీ ద్వారా చీనీ తోటల సాగుకు కూలీలకయ్యే ఖర్చులో సగం అందించాలి. దీంతో రైతుకు కాస్త ఊరట లభిస్తుంది.

–పార్నపల్లి ప్రభాకర్, తాడిమర్రి

రాయితీలను సకాలంలో అందించాలి



చీనీ తోటల సాగు రైతులకు ప్రభుత్వం రాయితీలను అందించాలి. చీనీ మొక్కల నుంచి సేంద్రియ ఎరువులు, రసాయన మందులు తదితర పెట్టుబడులు అధికం అవుతున్నాయి. వాటి నుంచి రైతుకు ఉపశమనం కలగాలంటే రాయితీలను సకాలంలో అందించాలి.

–టీ.గంగాధరరెడ్డి, తాడిమర్రి

ప్రభుత్వ పాఠశాల స్వీపర్లకు కనీస వేతనం ఇవ్వాలి


నినాదాలు చేస్తున్న స్వీపర్లు, సీఐటీయూ నాయకులు

ధర్మవరం: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే స్వీపర్లకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కోకన్వీనర్ ఆదినారాయణ డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే స్వీపర్లతో సీఐటీయూ కార్యాలయంలో అవగాహన సదస్సుతోపాటు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 20 ఏళ్లుగా స్వీపర్లుగా పనిచేస్తున్న వారికి రూ.4 వేలు మాత్రమే వేతనం ఇస్తున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ప్రభుత్వం ఇస్తున్న వేతనం ఏమాత్రం సరిపోవడంలేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి స్వీపర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కూల్ స్వీపర్ల యూనియన్ నేతలు జయమ్మ, చౌడమ్మ, ముంతాజ్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


అలంకరణలో స్వామివారు

అమరాపురం: హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అర్చకులు స్వామి వారికి సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. మడకశిర నియోజకవర్గం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాలైన బెంగళూరు, తుమకూరు, శిర, హిరియూర్, పావగడ, చెలికెర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.

వైద్య శిబిరంతో పేదలకు కంటిచూపు


కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి వైద్య శిబిరంతో పేదలకు కంటిచూపును అందిస్తున్నామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు కార్యదర్శి రమేష్‌బాబు, కోశాధికారి నాగేంద్రలు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం శైలజ, మార్కండేయులు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ గత 40 ఏళ్ల నుంచి పేదలకు ఉచితంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహించి కంటిచూపు అందిస్తున్నామన్నారు. శిబిరంలో 92మందికి కంటిపరీక్షలను చేయగా 55మంది శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు గోసే రాధాకృష్ణ, మెటికల కుళ్లాయప్ప, రాజగోపాల్, పల్లెం వేణుగోపాల్, గూడూరు మోహన్‌దాస్, కొత్త శ్రీరాములు, చందా నాగరాజు, పుట్లూరు నరసింహులు, వెంకటేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాల చోరీ

సోమందేపల్లి: మండలంలోని చల్లాపల్లిలో రైతు లక్ష్మీనారాయణరెడ్డికి చెందిన డ్రిప్ పరికరాలను దొంగలు ఎత్తుకెళ్లారు. పొలంలో మొక్కజొన్న పంట సాగు కోసం డ్రిప్ అమర్చగా శనివారం రాత్రి చోరీ జరిగినట్లు బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇటీవల పొలాల్లో స్టార్టర్లు, విద్యుత్ తీగలు చోరీకి గురవుతుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. పోలీసులు నిఘా పెంచి, చోరీలు నివారించాలని వారు కోరారు.

పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాడిమర్రి: స్థానిక ఎస్సీ కాలనీలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి అమ్మవారి మూల విరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చు కున్నారు. పూజారి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం


గర్భకోశ పరీక్షలను నిర్వహిస్తున్న డాక్టర్ టీవీ సుధాకర్

ధర్మవరం రూరల్: వసంతపురం గ్రామంలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం నిర్వహించారు. డీఎల్‌డీఏ జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ టీవీ సుధాకర్, సహాయ సంచాలకులు డాక్టర్ వీరభద్రయ్య, పశువైద్యాధికారి శేఖర్ లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ పశు గర్భధారణ పథకంపై వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు భవిష్యత్‌లో లింగ నిర్ధారిత వీర్యం అత్యధిక ప్రాచుర్యం పొందుతుందన్నారు. ఈ వీర్యంతో 90 శాతం ఖచ్చితత్వంతో పెయ్య దూడలు జన్మిస్తాయన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 53 పశువులకు గర్భకోశ పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగానందరెడ్డి, రైతులు, ఎహెచ్‌ఎస్‌లు, జీఎంఎస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎస్పీ


మంత్రికి మొక్క అందిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను జిల్లా ఎస్పీ రత్న ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ధర్మవరంలోని క్యాంపు కార్యాలయంలో ఆమె మంత్రిని కలిసి జిల్లాలో శాంతిభద్రతలపై చర్చించారు.

బాటమారెమ్మకు ప్రత్యేక పూజలు


అలంకరణలో బాటమారెమ్మ

కనగానపల్లి: మండల కేంద్రానికి సమీపంలో ప్రధాన రహదారి పక్కన వెలసిన బాటమారెమ్మ దేవతకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ఆభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు బోనాలు ఎత్తుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా చిన్న పీర్ల పండుగ


దొన్నికోటలో పీర్లను జలధికి తరలిస్తున్న దృశ్యం


బీడుపల్లిలో జలిధికి తరలిపోతున్న పీర్లు


తాడిమర్రిలో వీధుల్లో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండల కేంద్రంలో ఆదివారం గ్రామస్తులు చిన్న పీర్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. పెద్ద కాశీం, చిన్న కాశీం, హుస్సేన్, హుస్సేన్ తదితర పీర్లకు ముల్లాసాబ్ నూతన వస్త్రాలు ధరింపజేసి, వెండి గొడుగులు తొడిగి, పలు రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి పీర్లను గ్రామంలో పలు వీధుల్లో డప్పుల వాయిద్యాలు, మేళతాళాలతో ఊరేగించారు. అనంతరం పీర్లను పవలింపజేసి తిరిగి సాయంత్రం పీర్లను గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని చెక్కర, బెల్లం చదించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు.

ఘనంగా జలధి ఉత్సవం

ఎన్పీకుంట: దిగువతూపల్లి, ముండ్లవారిపల్లిలో ఆదివారం జలధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను వివిధ రకాల పూలు, గొడుగులు ధరింపజేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఆయా గ్రామాల్లోని పురవీధుల్లో డప్పు వాయిద్యాల నడుమ పీర్లను ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు దారి పొడవునా పీర్ల స్వాములకు బిందెలతో నీళ్లు పోస్తూ దండాలు పెట్టారు. భక్తులు చెక్కర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. జలధి ఉత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

అమడగూరు: గుండువారిపల్లి, చినగానిపల్లి, మహమ్మదాబాద్ గ్రామాల్లో ఆదివారం జలధి కార్యక్రమం నిర్వహించారు. ఆయా నిర్వాహకులు ఉదయం 3 గంటలకే అగ్నిగుండ ప్రవేశాన్ని ఏర్పాటు చేశారు. యువకులు, మహిళలు తడి బట్టలతో వచ్చి అగ్నిగుండంలో నడుచుకుంటూ వెళ్లారు. అలాగే తడి దుస్తులతో పీర్లను ఎత్తుకోవడానికి యువకులు పెద్దెత్తున ఎగబడ్డారు. పీర్లను పుర వీధుల్లో ఊరేగించారు. ప్రతి ఇంటి దగ్గర పీర్ల స్వాములకు ప్రత్యేక పూజలు గావించారు.

పుట్టపర్తి టౌన్: బీడుపల్లిలో ఆదివారం పీర్ల జలధి కార్యాక్రమం జరిగింది. ఉదయం గ్రామంలో పీర్లను ఊరేగించారు. అనంతరం పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేయించారు. ఈసందర్భంగా భక్తులు పీర్లకు చెక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పీర్లను ఊరిగించిన అనంతరం జలధికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటలను జరగకుండా సిఐ కొండారెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

బత్తలపల్లి: జ్వాలాపురం, కాటమకుంట గ్రామాల్లోని పీర్లను ఆదివారం ఏటికి సాగనంపారు. తెల్లవార్లు పీర్లను అందంగా ముస్తాబు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. పీర్ల స్వాములకు ముజావర్లు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించిన తరువాత మూగజీవాలను బలిఇచ్చారు. అనంతరం స్వాములను పురవీధుల్లో ఊరేగింపు జలధికి తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నల్లమాడ: రెడ్డిపల్లి, ఎన్.ఎనుమలవారిపల్లి, దొన్నికోట, పెమనకుంటపల్లి, చౌటకుంటపల్లిలో ఆదివారం జలధి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే పీర్ల చావిళ్ల ముందు అగ్ని గుండాల వద్ద పొట్టేళ్లు, కోళ్లు బలిచ్చారు. సాయంత్రం తప్పెట దరువులకు అనుగుణంగా యువకులు, ఉత్సాహవంతులు అలావు తొక్కారు. భక్తులు పీర్లుకు చెక్కెర, బెల్లం చదివించి పూజలు నిర్వహించారు. అనంతరం ముజావర్లు పీర్ల స్వాములను జలధికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో జలధి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ఆదివానం పీర్లను భక్తిశ్రద్ధలతో జలధికి తరలించారు. మొక్కుబడి ఉన్న భక్తులు శనివారం రాత్రి అగ్నిగుండంలోకి మొద్దులు వేశారు. తెల్లవారుజామున పీర్లతో అగ్నిగుండ ప్రవేశం చేయించారు. సాయంత్రం పీర్ల స్వాములను ప్రత్యేకంగా అలకంరించి వీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. గ్రామస్తులు స్వామికి చక్కెర చదివింపులు చేయించారు. యువత అలావ్ తొక్కుతూ సందడి చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


చెన్నేకొత్తపల్లిలో పీర్లస్వాముల ఊరేగింపు


బత్తలపల్లి మండలం జ్వాలాపురంలో పీర్లను ఊరేగిస్తున్న గ్రామస్తులు


ఎన్పీకుంట మండలం ముండ్లవారిపల్లిలో పీర్ల ఊరేగింపు


ఎన్పీకుంట మండలం దిగువతూపల్లిలో ఊరేగుతున్న పీర్లస్వాములు

భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు బోనాలు


బోనాలు తీసుకెళుతున్న మహిళలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పలు వార్డుల్లోని మహిళలు ఆదివారం దుర్గమ్మదేవత, సాలేవీధి పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. 14వవార్డుకు చెందిన మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి పెద్దమ్మ, దుర్గమ్మ ఆలయాలకు చేరుకుని బోనాలను సమర్పించారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.


ప్రత్యేక అలంకరణలో సాలేవీధి పెద్దమ్మతల్లి

అనర్థాలకు కారకులైతే కఠిన చర్యలు



మాట్లాడుతున్న వైద్యాధికారిణి డాక్టర్ పద్మజ

హిందూపురం టౌన్: ఆర్ఎంపీలు వచ్చీరాని వైద్యంతో ఏవైనా అనర్థాలకు కారకులైతే వారిపై కఠిన చర్యలు తప్పవని వైద్యాధికారులు హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని అల్‌హిలాల్ పాఠశాలలో ఆర్ఎంపీలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మాస్ మీడియా అధికారి బాబాఫక్రుద్దీన్, వైద్యాధికారులు డాక్టర్ పద్మజ, డాక్టర్ మాధుర్య మాట్లాడారు. ఆర్ఎంపీలు పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోకుండా అత్యవసర సేవల కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు గాని, ఇతర అర్హత ప్రమాణాలు కలిగిన ఆస్పత్రులకు రెఫర్ చేయాలన్నారు. జిల్లాలోని కొక్కంటిక్రాస్‌లో జరిగిన సంఘటనలు లాంటివి పునరావృతం కాకుండా చూడాలన్నారు. అలాగే 'క్లినిక్' అని, 'చిన్నపిల్లలకు ప్రత్యేకముగా చూడబడును' అనే బోర్డులను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. ప్రథమ చికిత్స కేంద్రాలు అని మాత్రమే బోర్డులు ఉండాలన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాల్లో బెడ్లు, సెలైన్ బాటిల్స్‌తో పాటు స్టాండ్లు, మంచాలు ఉండకూడదన్నారు. రోగులకు ఇంజక్షన్స్ వేయరాదని తెలిపారు. ప్రసవాలు, అబార్షన్లు చేయకూడదని స్పష్టం చేశారు. ల్యాబ్ పరీక్షలు నిర్వహించరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఆర్ఎంపీల సంఘం సభ్యులు గోవిందరాజులు, ఆంజనేయులు, ఏసురత్నం మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ముస్తఫా, రమేష్, మల్లప్ప, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.